సాక్షి ఖమ్మం

మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



జాబితా తయారీపై ప్రత్యేక శ్రద్ధ

ఓటర్ల జాబితా తయారీలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. 8లో



ప్రజల దీవెనల కోసం వస్తున్నా..

మూడుసార్లు గెలిపించిన ప్రజల దీవెనల కోసం మరోసారి వస్తున్నానని సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 24°

వాతావరణం

మంగళవారం జిల్లాలో ఎండ ప్రభావం కనిపిస్తుంది. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

ప్రపంచ శాంతికి బాటలు వేయాలి

ఐక్యరాజ్యసమితిలో ఖమ్మం వాసి ప్రసంగం



శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: లింగ సమానత్వం ప్రాధాన్యతతో పాటు అణు ఆయుధ నిర్మూలన దిశగా అన్ని దేశాలు ప్రయత్నించడం ద్వారా ప్రపంచ శాంతికి బాటలు వేయాలని డాక్టర్ ఖమ్మంకు ఏలూరి శ్రీనివాస్ కోరారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో 'ఐక్యరాజ్య సమితి–సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు' అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. మహిళల విద్య, ఆర్థికాభివృద్ధితోనే దేశాల అభివృద్ధికి బాటలు పడతాయని తెలిపారు. అలాగే, ప్రపంచమంతా అణు ఆయుధ నిర్మూలన అత్యవసరమని.. లేకపోతే మానవ జాతి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని చెప్పారు. ప్రజలు అణ్వస్త్రాలను కాకుండా అన్నవస్త్రాలు మాత్రమే కోరుకుంటున్నారని తెలిపారు. అన్ని దేశాలు కలిసి ఒక కాలపరిమితిలో అణు ఆయుధాలు నిర్మూలించాలని కోరారు. ఈసందర్భంగా డాక్టర్ ఏలూరి శ్రీనివాస్‌ను వివిధ దేశాల ప్రతినిధులు అభినందించారు.

నేడు, రేపు పర్యాటక దినోత్సవ వేడుకలు

ఖమ్మం స్పోర్ట్స్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళ, బుధ వారాల్లో వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి బి.సుమన్‌చక్రవర్తి తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో చంద్రయాన్, క్రాఫ్ట్, పెయింటింగ్ అంశాల్లో కళాశాలల విద్యార్థులకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే, కల్లూరు మండలంలోని కనిగిరి హిల్స్‌లో ట్రెకింగ్ ఉంటుందని తెలిపారు. ఇంకా 27న సాయంత్రం లకారం ట్యాంక్‌బండ్‌పై ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామని, 29వ తేదీన నేలకొండపల్లిలో బౌద్ధస్తూపం చరిత్రపై సెమినార్ ఉంటుందని వివరించారు.

పోలీసు ఉద్యోగుల కుటుంబాలకు చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ ఈ ఏడాది జూన్ 30న అనారోగ్యంతో మృతి చెందిన బాబు, జూన్ 6న మృతి చెందిన ఏఆర్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులకు సీపీ విష్ణు ఎస్.వారియర్ ఆర్థిక సాయం అందజేశారు. ఖమ్మంలోని కార్యాలయంలో ఆయన రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేసి మాట్లాడారు. ఉద్యోగుల కుటుంబాలకు శాఖాపరంగా అండగా నిలుస్తామని తెలిపారు.

గ్రీవెన్స్‌కు స్పందన

ప్రతీ సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌కు ఈసారి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వృద్ధాప్యంలో ఉన్న తమను వారసులు పట్టించుకోవడం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. అలాగే, భూవివాదాలు, వ్యక్తిగత సమస్యలపై ఫిర్యాదులు అందగా క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరిధిలో న్యాయం చేయాలని ఎస్‌హెచ్‌ఓలను సీపీ వారియర్ ఆదేశించారు.

రామయ్య ఆదాయం రూ.కోటి



హుండీల్లోని నగదు లెక్కిస్తున్న సిబ్బంది

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. దేవాదాయ శాఖ, దేవస్థాన అధికారుల ఆధ్వర్యాన హుండీలను తెరిచి చిత్రకూట మండపంలోకి తరలించి లెక్కించారు. ఈ సందర్భంగా 61 రోజులకు గాను రూ.1,07,46,350 ఆదాయం నగదు రూపంలో లభించిందని ఈఓ రమాదేవి వెల్లడించారు. అలాగే, బంగారం, వెండితో పాటు విదేశీ కరెన్సీ వచ్చిందని ఆమె పేర్కొన్నారు.

రామయ్య సన్నిధిలో హైకోర్టు జడ్జి

భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, భద్రాచలం వాసి భీమపాక నగేష్ తన కుటుంబ సభ్యులతో సోమవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూల మూర్తులను దర్శించుకున్నారు.

బుగ్గవాగు కాదు.. మంచుకొండ



ఎత్తిపోతల పథకం నిర్మించనున్న సాగర్ ప్రధాన కాల్వ పరిధిలోని వీ.వీ.పాలెం వద్ద డీప్ కట్

నాగార్జునసాగర్ ద్వారా జిల్లాలో మరింత ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ఇందుకోసం కొత్తగా ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. సాగర్ ప్రధాన కాల్వ సాగుతున్న రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ సమీపాన వీ.వీ.పాలెం డీప్ కట్ వద్ద ఈ ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తారు. అనంతరం ఎలాంటి భూసేకరణ అవసరం లేకుండానే రెండు పైపులైన్ల ద్వారా రఘునాథపాలెం మండలంలోని 31 చెరువులకు సాగునీరు అందించేలా ప్రతిపాదనలు రూపొందించారు. ఈ నిర్మాణంతో కొత్తగా 2,500 ఎకరాల భూమికి పుష్కలంగా సాగునీరు అందించొచ్చని జల వనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. – ఖమ్మంఅర్బన్

రూ.80 కోట్లతో కొత్త ఎత్తిపోతల పథకం

- వీ.వీ.పాలెం సాగర్ డీప్ కట్‌పై నిర్మాణానికి ప్రణాళిక
- 31 చెరువులకు సాగర్ జలాలు.. 2,500 ఎకరాల ఆయకట్టు
- భూసేకరణ లేకుండానే పైపులైన్ ద్వారా పారించేలా రూపకల్పన
- ఇప్పటికే సిద్ధంగా రూ.30కోట్ల పైచిలుకు నిధులు

బుగ్గవాగు వద్ద చెక్‌డ్యాం నిర్మించినా...

కామేపల్లి మండలం సమీపాన బుగ్గవాగు వద్ద గతంలో చెక్‌డ్యాం నిర్మించారు. ఇక్కడి నుంచి వరద నీటిని మళ్లించి కామేపల్లి మండలంలోని కొన్ని చెరువులతో పాటు రఘునాథపాలెం మండలంలోని 30కి పైగా చెరువులు నింపడానికి రూ.39.06కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇందుకోసం కాల్వలు తవ్వాల్సి ఉండగా, భూసేకరణ అడ్డంకిగా మారడంతో ఏళ్లుగా పనులు ముందుకు సాగడం లేదు. రఘునాథపాలెం మండలంలో వ్యవసాయ భూమి ఎకరా ధర రూ.కోటి నుంచి రూ.3కోట్ల పైచిలుకు ఉండడంతో బుగ్గవాగు ద్వారా చెరువులకు నీరు మళ్లించడానికి కాల్వలు తవ్వేందుకు అవసరమైన భూమిని ఇచ్చేందుకు రైతులు సుముఖత చూపడం లేదు. ప్రభుత్వం నుంచి అతితక్కువగా పరిహారం రానుండడంతో సర్వే కోసం పలుమార్లు వెళ్లిన జల వనరులశాఖ, రెవెన్యూ అధికారులను అడ్డుకున్నారు. దీంతో అధికారులు కలెక్టర్‌తో చర్చించినప్పుడు రైతులు సుముఖంగా లేకుంటే తాత్కాలికంగా నిలిపివేయాలని సూచించగా.. అప్పటి నుంచి కదలిక లేదు.

నిధులు రెడీ..

బుగ్గవాగు చెక్‌డ్యాం నుంచి కాల్వలు తవ్వే బదులు ప్రత్యామ్నాయంగా సాగర్ ప్రధాన కాల్వపై లిఫ్ట్ ఏర్పాటుచేస్తే ఎలాంటి భూసేకరణ లేకుండానే రెండు పైపులైన్ల ద్వారా రఘునాథపాలెం మండలంలోని 31 చెరువులు నింపడమే కాక 2,500 ఎకరాల భూమికి సాగునీరు అందించొచ్చని అధికారులు భావించారు. ఈమేరకు ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, జలవనరుల శాఖ ఉన్నతాధికారులకు సమర్పించగా వారు సానుకూలత వ్యక్తం చేశారు. అంతేకాకుండా బుగ్గవాగు కాల్వలకు కేటాయించిన నిధులు ఉన్నందున ఇప్పటికిప్పుడు పనులు చేయొచ్చనే భావనతో పది రోజుల రోజుల క్రితం సీఈ విద్యాసాగర్ పర్యవేక్షణలో ఎస్‌ఈ నర్సింగరావు, ఈఈ అనన్య, డీఈ రమేష్‌రెడ్డి తదితరులు కసరత్తు పూర్తిచేసి లిఫ్ట్ నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

భూసేకరణ అవసరం లేకుండా..

వీ.వీ.పాలెంలోని సాగర్ కాల్వ డీప్ కట్ వద్ద నిత్యం నీరు నిల్వ ఉండడంతో లిఫ్ట్ నిర్మిస్తే ఎలాంటి భూసేకరణ చేయకుండానే పైపులైన్ల ద్వారా చెరువులకు నీరు సరఫరా చేయొచ్చని అధికారులు చెబుతున్నారు. ఏడు మోటార్ల ద్వారా సాగర్ కాల్వ నీటిని తోడి వీ.వీ.పాలెం నుంచి చింతగుర్తి వరకు ఎనిమిదిన్నర కి.మీ. మేర ఒక పైపులైన్, మంచుకొండ వరకు 11 కి.మీ. నిడివితో ఇంకో పైపులైన్ ఏర్పాటుచేసి చెరువులకు సరఫరా చేస్తారు. కాల్వల తవ్వకానికి మంజూరైన రూ.39.06 కోట్ల నిధులు ఉన్నందున, మరో రూ.40కోట్ల పైచిలుకు నిధులు వస్తే పథకం పూర్తికానుంది. ఇక పైపులైన్ కూడా రోడ్డు పక్కన నిర్మించేలా ప్రతిపాదనల్లో పొందుపర్చారు. ఇప్పటికే ఉన్నతాధికారులు ఈ ప్రణాళికకు ఆమోదం తెలిపినందున ఒకటి, రెండు రోజుల్లో జీఓ విడుదలయ్యే అవకాశముందని తెలిపారు. గతంలో బుగ్గవాగుపై సుమారు రూ.5కోట్లతో చెక్‌డ్యాం నిర్మించి ఉండడంతో దానిద్వారా కామేపల్లి మండలంలో రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే...

- ఉమ్మడి జిల్లాలో పది సీట్లూ గెలుస్తాం..
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- కాంగ్రెస్‌లో చేరాక జిల్లాకు వచ్చిన తుమ్మలకు ఘన స్వాగతం
- హాజరైన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నేతలు



మయూరిసెంటర్ మీదుగా ర్యాలీగా వస్తున్న తుమ్మల యుగంధర్, కార్యకర్తలు (ఇన్‌సెట్) అభివాదం చేస్తున్న భట్టి విక్రమార్క, పొంగులేటి, తుమ్మల నాగేశ్వరరావు, సంభాని చంద్రశేఖర్, పువ్వాళ్ల

ఖమ్మం వన్‌టౌన్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరాక తొలిసారి సోమవారం ఖమ్మం వచ్చారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఖమ్మం రూరల్ మండలం వద్ద ఆయనకు ఘనస్వాగతం పలకగా... సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ర్యాలీగా జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకున్నారు. ఇక్కడ కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి భట్టి మాట్లాడుతూ హైదరాబాద్ తుక్కుగూడ సభలో సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే అమలుచేసి తీరుతామన్నారు. ఇచ్చిన మాట తప్పకుండా తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తించి ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. అయితే, బీఆర్‌ఎస్ పార్టీ మద్యం, అధికారం, డబ్బును అడ్డం పెట్టుకుని మరోమారు అధికారంలోకి రావాలని చూస్తున్నప్పటికీ అది జరగదని తెలిపారు. వచ్చే ఎన్నికలు బీఆర్‌ఎస్ పార్టీ అహంకారం – ప్రజలు ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలనుకునే కాంగ్రెస్ మధ్య జరుగనున్నాయని వివరించారు. ఏదిఏమైనా ధర్మయుద్ధంలో ప్రజల సహకారంతో తామే గెలుస్తామని.. ఉమ్మడి జిల్లాలో పది స్థానాలను గెలవడమేకాక రాష్ట్రంలో 74 నుంచి 78 స్థానాలను గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆరు గ్యారంటీలు ఎలా అమలు చేస్తారంటూ బీఆర్‌ఎస్ నేతలు ప్రజల్లో అయోమయం సృష్టిస్తున్నారని.. తాము రాష్ట్ర సంపదను దోచుకోకుండా ప్రజలకు పంచుతామని భట్టి వెల్లడించారు. ఇక బీఆర్‌ఎస్ పార్టీ అక్రమంగా అమ్మిన భూములను, పేదల నుంచి లాక్కొన్న భూములను తిరిగి చట్టపరంగా పేదలకు ఇస్తామని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి..

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తన ప్రజాజీవితం తెరిచిన పుస్తకమని చెప్పారు. భద్రాచలం శ్రీరామచంద్రుడి దయతో జిల్లా, రాష్ట్రాభివృద్ధి కృషి చేశానని, భవిష్యత్‌లోనూ ఇదే ఒరవడి కొనసాగిస్తానన్నారు. కాంగ్రెస్ జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకత్వం తనను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించడమే గౌరవం, గుర్తింపుగా భావిస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఏ హామీని అమలుచేయకపోగా రాష్ట్రాన్ని కల్వకుంట్ల ప్రభుత్వం దోచుకుందని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో నిరుద్యోగ యువత నష్టపోయిందని, తాము అధికారంలోకి రాగానే 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాయకులు మహ్మద్ జావీద్, రాయల నాగేశ్వరరావు, సాధు రమేష్‌రెడ్డి, దొబ్బల సౌజన్య, నాగండ్ల దీపక్‌చౌదరి, రాందాస్, జారె ఆదినారాయణ, ఐలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, యడ్లపల్లి సంతోష్ పాల్గొన్నారు.

తుమ్మలకు ఘన స్వాగతం, ర్యాలీ

ఖమ్మంరూరల్: కాంగ్రెస్‌లో చేరాక తొలిసారి ఖమ్మం వచ్చిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఖమ్మం రూరల్ మండలం బారుగూడెం శ్రీసిటీలోని క్యాంప్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి గొల్లగూడెం, వరంగల్ క్రాస్‌రోడ్, పెదతండా, నాయుడుపేటకు చేరుకున్నారు. ఈసందర్భంగా పెద్ద సంఖ్యలో ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించగా, బాణసంచా కాల్చారు. నాయకులు సాధు రమేష్‌రెడ్డి, గరికపాటి వెంకట్రావు, మద్ది వీరారెడ్డి, జంగం భాస్కర్, పత్తి శ్రీనివాస్, జొన్నలగడ్డ రవికుమార్, ఎరసాని శివశంకర్‌రెడ్డి, యాట శ్రీను, చింతమళ్ల రవికుమార్, తేజావత్ పంతులు నాయక్, ఎల్లయ్యనాయక్, చీకటి శ్రీనివాస్, తోట వీరభద్రం, పల్లెర్ల పాండు, కన్నేటి వెంకన్న పాల్గొన్నారు.

అటు దోమలు.. ఇటు జ్వరాలు

కేఎంసీ కార్యాలయానికి కూతవేటు దూరాన, కొత్త బస్టాండ్‌కు దగ్గరగా ఉన్న ఎన్నెస్పీ క్యాంపులో డ్రెయినేజీలు సక్రమంగా లేక కచ్చా కాల్వల ద్వారానే మురుగు నీరు బయటకు వెళ్తోంది. మురుగులో పందులు తిరుగుతుండడంతో నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పందుల సంచారంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.



- కాలనీల్లో అపరిశుభ్రత.. ఖాళీస్థలాల్లో మురుగు నీరు
- ఆందోళనలో ఖమ్మం నగర ప్రజానీకం
- దోమలతో పాటే పెరుగుతున్న వ్యాధులు
- పారిశుద్ధ్య లోపంతోనే అంటున్న జనం

గ్రౌండ్ రిపోర్ట్

ఖమ్మంమయూరిసెంటర్: అసలే సీజనల్ వ్యాధుల కాలం.. ఇళ్లలోనే కాక కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉంది. ఇందులో భాగంగా ఖాళీ స్థలాల్లో, కచ్చా కాల్వల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ యంత్రాంగంపై ఉంటుంది. కానీ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అలా జరగడం లేదు. ఫలితంగా ఖమ్మం నగరంలో అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. తరచుగా కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. డెంగీ కేసులు నానాటికీ పెరుగుతుండడం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. కేఎంసీలోని 60 డివిజన్లలో సుమారు 5లక్షల మంది నివాసముంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఖాళీ స్థలాలు మురుగు, వర్షపు నీటికి ఆవాసంగా మారాయి. అందులో పిచ్చి మొక్కలు పెరగడం, పందులు తిరగడమే కాక దోమల సంతతి వృద్ధి చెందింది. ఫలితంగా జనం డెంగీ తదితర సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. నగరంలోని పలు కాలనీల్లో 'సాక్షి' సోమవారం పరిశీలించగా అనేక సమస్యలు బయటపడ్డాయి.

భయపెడుతున్న డెంగీ..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న డెంగీ కేసులు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. మలేరియా, ఇతర దోమలతో పాటు డెంగీ కారకమైన ఈజిప్ట్ ఎడిషన్ దోమ నగరంలో భారీగా ఉన్నట్లు తెలుస్తోంది. పగటి పూట కుట్టే ఈ దోమ నిల్వ ఉన్న మంచినీటిలోనే పెరుగుతుంది. ఇళ్లు, ఇతర భవన సముదాయాల్లోని చిన్న చిన్న పాత్రలు, సంపుల్లో పెరిగే ఈ దోమ కాటుతో నగరంలో ఇప్పటి వరకు 53 మంది డెంగీ బారిన పడినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇక ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న వారిని పరిగణనలోకి తీసుకుంటే ఇది రెండింతలకు పైగా ఉండొచ్చని సమాచారం. వీటితో పాటు ఇతర సీజనల్ వ్యాధుల బారిన పడిన వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. డ్రై డే సక్రమంగా నిర్వహించకపోవడమే ఈ పరిస్థితికి కారణమని తెలుస్తోంది.

శ్రీనివాసనగర్‌లోని పలు కాలనీల్లో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండడం, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగు నీరు ఆ కాల్వల ద్వారా బయటకు పారుతోంది. కచ్చా కాల్వలు, ఖాళీస్థలాల్లో మురుగు నిలిచి అపరిశుభ్రంగా మారింది. ఈ ప్రాంతంలో డెంగీ కేసులు నమోదవుతున్నట్లు అధికారులు గుర్తించారు.



నగర శివారు ప్రాంతమైన ప్రకాశ్‌నగర్‌లోని అనేక వీధుల్లో డ్రెయినేజీలు సక్రమంగా లేవు. ఇక్కడ బహిరంగ ప్రదేశాల్లోనే గేదెలను కట్టి ఉంచడంతో వాటి చుట్టుపక్కల దోమల వ్యాప్తి ఉంటోంది. ఓ పక్క మురుగు నీరు, ఆ పక్కనే గేదెలు కట్టేయడంతో వచ్చే దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.



రమణగుట్ట ప్రాంతంలోని ఖాళీ స్థలాల్లో నీరు చేరి చెరువులను తలపిస్తోంది. వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్న ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో దోమల బెడద ప్రజలను వేధిస్తోంది.



కేఎంసీ సమాచారం...

నగరంలోని గృహాల సంఖ్య	94,000
డివిజన్లు	60
ప్రతిరోజు సేకరించే చెత్త	175 మెట్రిక్ టన్నులు
పారిశుద్ధ్య నిర్వహణ వ్యయం(నెలకు)	రూ.45 లక్షలు
ఉపయోగిస్తున్న అన్నిరకాల వాహనాలు	216
శానిటేషన్ కార్మికులు	80 మంది

ఖమ్మం నగరంలో డెంగీ కేసులు

నెల	కేసులు
జనవరి	01
జులై	06
ఆగస్ట్	13
సెప్టెంబర్ (22వ తేదీ వరకు)	33
మొత్తం	53

దోమలతో అవస్థ పడుతున్నాం..



కొన్నాళ్లు దోమల బెడద తగ్గినా నెల రోజులుగా మళ్లీ పెరిగింది. సాయంత్రమైతే చాలు బయట ఉండలేకపోతున్నాం. ఒకస్థాయి దాటాక ఇంటి తలుపులు మూసే ఉంచాల్సి వస్తుంది. నిత్యం ఫాగింగ్ చేస్తే వీటిని అరికట్టొచ్చు. కచ్చా కాల్వల వద్ద నీరు నిల్వ లేకుండా చూడాలి.

– ఆర్.రవి, పెద్దమ్మతల్లి నగర్

ఖాళీ స్థలాల్లో నీరులేకుండా చూడాలి



ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. డెంగీ జ్వరాలు ఈ నెల చాలా మందికి వస్తున్నాయి. డ్రై డే కార్యక్రమాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. డెంగీని అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలి,

– టి.మురళి, మంచికంటి నగర్

డీసీసీబీలో ఇంటి దొంగలు

- రుణాల మంజూరులో అంతులేని అవినీతి
- ముద్ర రుణాల్లోనూ అక్రమాల పరంపర
- అన్నపురెడ్డిపల్లిలో బయటపడిన వైనం
- ముల్కలపల్లి, టేకులపల్లి, మర్లపాడుల్లోనూ అదే పరిస్థితి
- విచారణకు ప్రత్యేకాధికారుల నియామకం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. కొన్నేళ్లుగా బ్యాంకులో అక్రమాలు సర్వసాధారణం కాగా, తవ్విన కొద్దీ ఆనవాళ్లు బయటపడుతున్నాయి. అయితే, చాలా బ్రాంచ్‌ల్లో తప్పులు జరగడానికి అధికారులు, ఉద్యోగులేనని తేలుతుండడం గమనార్హం. డీసీసీబీ ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం, గార్ల, ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం మండలాల్లో విస్తరించి ఉంది. వంద పీఏసీఎస్‌లు, 50 బ్రాంచ్‌లతో కొనసాగుతున్న డీసీసీబీ ద్వారా పంట రుణాలు, దీర్ఘకాలిక, మధ్య కాలిక రుణాలతో పాటు గృహ, వాహన, బంగారం తాకట్టు, ముద్ర, విద్యా, మార్ట్‌గేజ్ వంటి రుణాలను జారీ చేస్తున్నారు. దాదాపు రూ.3 వేల కోట్ల మేర లావాదేవీలు జరుగుతుండగా, ఏ రుణం కావాలన్నా అధికారులు, ఉద్యోగులకు ఎంతోకొంత ముట్టచెప్పాల్సి వస్తుందనే ప్రచారం జరుగుతోంది. ఇక బ్యాంకు ఉద్యోగుల బంధువులైతే నిబంధనలు పక్కన పెట్టి మరీ రుణాలు ఇస్తున్నారని తెలుస్తోంది.

ఇప్పటివరకు రూ.11కోట్లకు పైగా రుణాలు

చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందే వారి కోసం కేంద్రప్రభుత్వం రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు ముద్ర(మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ అండ్ రీ ఫైనాన్స్ ఏజెన్సీ) పేరిట రుణాలు ఇస్తోంది. పేద, మధ్య తరగతి వర్గాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ పథకం ద్వారా రుణాల పంపిణీలోనూ డీసీసీబీల్లో అక్రమాలు జరుగుతున్నాయి. 2019 జనవరి 2 నుంచి డీసీసీబీలో ముద్ర రుణాలు ఇస్తుండగా, ఇప్పటివరకు 4,245 మందికి రూ.17,11,77,452 మేర రుణాలు ఇచ్చారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 878 మందికి రూ. 5.60 కోట్లు ఇచ్చినట్లు అధికారిక సమాచారం. అయితే, పలు బ్రాంచ్‌ల్లో ముద్ర రుణాల జారీ సందర్భంగా అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. అన్నపురెడ్డిపల్లి బ్రాంచిలో మేనేజర్ నాగభూషణం ఇష్టారాజ్యంగా తన కుటుంబీకులు, పని వారితో పాటు ఇతర ప్రాంతాల వారికి రూ.లక్షల్లో రుణాలు ఇచ్చి అడ్డంగా దొరికిపోయారు. ఈ వ్యవహారంపై ఖమ్మం డీసీసీబీకి చెందిన ఏజీఎం కృష్ణమోహన్ విచారణ జరిపి నివేదిక సమర్పించగా నాగభూషణంను సస్పెండ్ చేశారు. ఈ బ్రాంచ్‌లో దాదాపు రూ.1.76 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ముల్కలపల్లి, టేకులపల్లి, మర్లపాడు బ్రాంచ్‌ల్లోనూ ముద్ర రుణాల పంపిణీ సందర్భంగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలొస్తున్నాయి. ఈ ఏడాది ముల్కలపల్లి బ్రాంచ్‌లో 31 మందికి రూ.16.24 లక్షలు, టేకులపల్లి బ్రాంచ్‌లో 44 మందికి రూ.63 లక్షలు, మర్లపాడు బ్రాంచ్‌లో 23 మందికి రూ.32 లక్షల మేర రుణాలు ఇచ్చారు. ఇవేకాక గతంలో ఇచ్చిన రుణాల్లోనూ అక్రమాలు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది.

ప్రత్యేకాధికారులతో విచారణ

అన్నపురెడ్డిపల్లి బ్రాంచ్‌లో జరిగిన అక్రమాలపై ఇప్పటికే విచారణ పూర్తయింది. ఇక ముల్కలపల్లి బ్రాంచ్‌కు డీజీఎం ఉపేందర్, టేకులపల్లి బ్రాంచ్‌కు ఏజీఎం వెంకటేశ్వర్లు, మర్లపాడు బ్రాంచ్‌కు అజయ్‌రెడ్డిని విచారణ అధికారులుగా నియమించారు. ఈ బ్రాంచ్‌ల్లోనూ భారీగానే అక్రమాలు జరిగినట్లు తెలుస్తుండగా విచారణ అనంతరం అసలు లెక్క తేలనుంది. కాగా, బ్రాంచ్‌ల్లో ఉద్యోగుల అవినీతి వెనుక కొందరు ఉన్నతాధికారుల ప్రమేయం కూడా ఉన్నట్లు డీసీసీబీలో చర్చ జరుగుతోంది.

విచారణ జరిపిస్తున్నాం...



ముద్ర రుణాల మంజూరు సందర్భంగా పలు బ్రాంచ్‌ల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో విచారించేందుకు అధికారులను నియమించాం. ఇప్పటికే అన్నపురెడ్డిపల్లి బ్రాంచ్ మేనేజర్‌ను సస్పెండ్ చేశాం. అధికారులు, ఉద్యోగులు అక్రమాలకు పాల్పడినట్లు తేలితే సహించేది లేదు.

– అట్లూరి వీరబాబు, సీఈఓ, డీసీసీబీ

క్లుప్తంగా

ఖైరతాబాద్ గణేషుడిని దర్శించుకున్న ఎంపీ



ఖైరతాబాద్ గణేషుడి వద్ద ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్ ఖైరతాబాద్‌లో ప్రతిష్ఠించిన భారీ గణనాథుడిని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కుటుంబంతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆయన స్వాగతం పలికి పూజలు చేయించాక సన్మానించారు.

సీపీ కార్యాలయం ఎదుట ధర్నా

పోలీసులు స్పందించడం లేదని ఆరోపణ



ధర్నా చేస్తున్న భద్రు కుటుంబసభ్యులు

ఖమ్మంక్రైం: జిల్లాలోని తిరుమలాయపాలెం మండలం కుక్కల తండా గ్రామానికి చెందిన ఓ కుటుంబసభ్యులు తమకు న్యాయం చేయాలంటూ ఖమ్మంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయం ముందు సోమవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా కుటుంబానికి చెందిన సురేష్ మాట్లాడుతూ జూలై 23న తన తండ్రి ఇస్లావత్ భద్రు గ్రామానికే చెందిన కొందరు కర్రలు, రాడ్లతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడని తెలిపారు. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినా, ఇప్పటివరకు ఎవరినీ అరెస్ట్ చేయకపోతే నిందితులతో రాజీ చేసుకోవాలని ఎస్ఐ, కూసుమంచి సీఐ సూచిస్తున్నారని ఆరోపించారు. గతంలో గ్రీవెన్స్, డీఐజీ, డీజీపీకి కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. నిందితులు అధికార పార్టీ నాయకుల అండతో తమను బెదిరిస్తున్నారని.. ఇకనైనా తమకు న్యాయం చేయాలని ధర్నాకు దిగగా, ఏసీపీ ప్రసన్నకుమార్ వారితో చర్చించారు. రెండు రోజుల్లోగా నిందితులను అరెస్ట్ చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.

పారదర్శకంగా బదిలీలు, పదోన్నతులపై హర్షం

ఖమ్మంసహకారనగర్: ఎనిమిదేళ్ల నిరీక్షణ తర్వాత ప్రభుత్వం ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు, ఐదేళ్ల తర్వాత బదిలీలను పారదర్శకంగా నిర్వహించడంపై టీఎస్ యూటీఎఫ్ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా నుంచి 158 మంది ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు పొంది వివిధ జిల్లాల్లో విధుల్లో చేరారని తెలిపారు. పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా పదోన్నతులు, బదిలీలు సజావుగా నిర్వహించారని, పదోన్నతి పొందిన వారు ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కాగా, ఎస్ఏలు, ఎస్జీటీల బదిలీలు, పదోన్నతులు కూడా ఇదే విధంగా నిర్వహించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు పారుపల్లి నాగేశ్వరరావు రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని తదితరులు ఓ ప్రకటనలో కోరారు.

జనారణ్యంలోకి చుక్కల దుప్పి



దుప్పితో స్థానికులు

సత్తుపల్లిటౌన్: ఓ చుక్కల దుప్పి సోమవారం జనారణ్యంలోకి రాగా, స్థానికులు బంధించి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. సత్తుపల్లిలోని పాలకేంద్రం వెనుకాల ఉన్న అర్బన్ పార్క్ ఫెన్సింగ్ – డ్రెయినేజీ నడుమ కొంత ఖాళీ ఉండటంతో అందులో నుంచి రెండు చుక్కల దుప్పులు బయటకు వచ్చాయి. ఇందులో ఓ దుప్పి పిల్ల వెనక్కి వెళ్లిపోయినా, ఇంకొకటి మాత్రం రోడ్డు దాటి గాంధీనగర్‌లోని జనవాసాల్లోకి వచ్చింది. దీంతో స్థానికులు దాన్ని బంధించి స్థానిక బీట్ ఆఫీసర్ ఎం వెంకటేశ్వర్లుకు అప్పగించారు. అనంతరం దుప్పిని అర్బన్ పార్క్‌లో వదిలేసినట్లు బీట్ ఆఫీసర్ తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,225	4,000
కందులు	11,000	11,000
మిర్చి	19,000	13,500
ఏసీ మిర్చి	24,000	18,500
మిర్చి తాలు	8,000	6,000
పత్తి	7,050	4,800

– ఖమ్మం వ్యవసాయం

ఓటరు జాబితా తయారీపై ప్రత్యేక శ్రద్ధ

- క్షేత్రస్థాయిలో పరిశీలించాకే మార్పులు, చేర్పులు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

ఖమ్మంసహకారనగర్: నూతన ఓటరు జాబితా రూపొందిస్తున్న సమయాన మార్పులు, చేర్పుల విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు చనిపోయిన వారి పేర్లు తొలగించేందుకు గాను క్షేత్రస్థాయి తనిఖీ చేయాలని తెలిపారు. హైదరాబాద్ నుంచి సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షించారు. ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా నుంచి కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ నూతన ఓటర్ల నమోదు, మార్పులుపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని తెలిపారు. అలాగే, అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, మాస్టర్ ట్రెయినర్ కె.శ్రీరామ్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

ప్రజలు ఇచ్చే వినతిపత్రాలు, దరఖాస్తులను సత్వరమే పరిశీలించి సమస్యలకు పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డేలో ఆయన వినతిపత్రాలు స్వీకరించి అధికారులకు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, డీఆర్డీఓ విద్యాచందన, కలెక్టరేట్ ఏఓ అరుణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్ డేలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమ్

ఈవీఎం గోదాం నిర్మాణ పనులు తనిఖీ

కలెక్టరేట్ ఆవరణంలో నిర్మిస్తున్న ఈవీఎం గోదాం పనులను కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే గోదాం సిద్ధమయ్యేలా పనుల్లో వేగం పెంచాలని ఆర్అండ్‌బీ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. అవసరమైతే అదనంగా కార్మికులను సమకూర్చుకోవాలని తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు ఉన్నారు.

భూసేకరణ త్వరగా పూర్తిచేయాలి..

జిల్లాలో ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ (పీఎంజీ) కోఆర్డినేషన్ కేబినెట్ సెక్రటరీ ప్రదీప్ కె.త్రిపాఠి సూచించారు. ఢిల్లీ నుంచి సోమవారం ఆయన జాతీయ రహదారులు, రైల్వే లైన్ తదితర అభివృద్ధి పనులకు భూసేకరణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భూసేకరణ త్వరగా పూర్తిచేసి ప్రాజెక్టుల పనుల్లో వేగం పెంచాలన్నారు. ఈసందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ నిధులు డిపాజిట్ కాగానే ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. జలవనరుల శాఖ అధికారి వెంకట్రాం, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ రంజిత్, జాతీయ రహదారుల శాఖ మేనేజర్ దివ్య పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్ తదితరులు

గణేష్ నిమజ్జనం సాఫీగా జరగాలి

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ

ఖమ్మంక్రైం/ఖమ్మం రూరల్: గణేష్ నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం నిమజ్జనం జరగనుండగా.. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి సోమవారం ఆయన నగరంలోని కాల్వొడ్డు, ప్రకాష్‌నగర్‌ల్లోని మున్నేరుతో పాటు ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా వైపు నిమజ్జనం జరిగే ప్రాంతాలను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా క్రేన్లు, ఫ్లడ్ లైట్లు, బారికేడ్లు ఏర్పాటుచేయాలని అధికారులకు సూచించారు. అలాగే, గజ ఈతగాళ్లను నియమించాలని తెలిపారు. అంతేకాకుండా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. సీసీ కెమెరాలను కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు. కాగా, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పంచాయితీరాజ్ ఉద్యోగులతో పాటు పోలీసు శాఖల ఉద్యోగులు సమన్వయంతో విధులు నిర్వర్తించి శోభాయాత్ర, నిమజ్జనం సాఫీగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, అడిషనల్ డీసీపీలు ప్రసాదరావు, కుమారస్వామి, ఏసీపీలు హరికృష్ణ, బస్వారెడ్డి, గణేష్, సారంగపాణి, విద్యుత్ శాఖ ఎస్ఈ సురేందర్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, అగ్నిమాపక అధికారి సూర్యప్రకాష్, డీపీఓ హరికిషన్, తహసీల్దార్లు బీ.వీ.రామకృష్ణ, సీహెచ్.స్వామి తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జన ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ వారియర్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

విద్యుత్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మంవ్యవసాయం: గణపతి శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా విద్యుత్ విషయంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈ ఏ సురేందర్ సూచించారు. మండపానికి అమర్చిన విద్యుత్ వైర్లను ముందుగా తొలగించాకే నిమజ్జనానికి బయలుదేరాలని తెలిపారు. అలాగే, ఎక్కడైనా విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉంటే తాకొద్దని, సిబ్బందికి సమాచారం ఇస్తే తొలగిస్తారని చెప్పారు. కాగా, విద్యుత్ సంబంధిత సమస్యలను తెలియచేసేందుకు 94408 11525 నంబర్‌తో ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూంలో సంప్రదించాలని తెలిపారు.

వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు, అధికారులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం కొత్తూరు, గంగారం, సత్తుపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు వరి సాగు చేయగా, విత్తనాల లోపంతో నష్టం ఎదురైందని వ్యవసాయాధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో రైతులు వరి పొలాలను శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల బృందం సోమవారం పరిశీలించింది. రైతులు కరీంనగర్‌కు చెందిన వరుణ్ సీడ్స్ ఎంటీయూ–1061 రకాన్ని మండలంలోని డీలర్ల వద్ద కొనుగోలు సాగు చేస్తే నిర్ణీత వ్యవధి కంటే ముందే కొంత శాతం కంకులు ఏర్పడడంతో నష్టపోయామని వివరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ నష్టంపై నివేదిక రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ కె.రుక్మిణిదేవి, వైరా కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శైలజ, సత్తుపల్లి ఏడీఏ యు.నర్సింహారావు, శాస్త్రవేత్తలు డాక్టర్ టి.భరత్, కె.రవికుమార్, జిల్లా సాంకేతిక వ్యవసాయాధికారి టి.ఛాయరాజ్, ఏఓ వై.శ్రీనివాసరావు, కంపెనీ ప్రతినిధులు సాయి బాబుగౌడ్, మహేంద్, ఎన్ఎస్‌సీ మేనేజర్ రవళి, ఏఈఓలు టి.నరేష్, కె.ఆశాజ్యోతి , పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

మైనార్టీ గురుకులాల క్రీడాపోటీలు ప్రారంభం

కొణిజర్ల: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి మైనార్టీ గురుకులాల్లో బాలుర క్రీడా పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. కొణిజర్ల మండలం అమ్మపాలెంలోని ముస్లిం మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో ఈ పోటీలను కొణిజర్ల ఎస్ఐ జె.శంకరరావు, మైనార్టీ శాఖ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎం.జే.అరుణకుమారి ప్రారంభించారు. మూడురోజుల పాటు ఎనిమిది క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మొదటిరోజు కబడ్డీ, వాలీ బాల్, హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.సైదులు, మైనార్టీ విజిలెన్స్ ఆఫీ సర్స్ కె.సీతారాములు, జమీల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కారేపల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, తతద్వారా నాయకత్వ లక్షణాలతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందని సింగరేణి తహసీల్దార్ వి.సురేష్ కుమార్, సీఐ తిరుపతిరెడ్డి అన్నారు. కారేపల్లిలోని వైరా గర్ల్స్–1 మైనార్టీ బాలికల గురుకుల విద్యాలయం, కళాశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి గురుకుల విద్యార్థుల క్రీడాపోటీలను సోమవారం వారు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని ఆరు మైనార్టీ బాలికల గురుకులాల నుంచి 450 మంది పోటీల్లో పాల్గొనగా, మూడు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నారు. మైనార్టీ గురుకులాల విజిలెన్స్ అధికారులు సీతారాములు, జమీల్ పాషా, ప్రిన్సిపాళ్లు శైలజ, అబిదా సల్మా, సీతామహాలక్ష్మి, గీత, హిమబిందు, నమిబి, వైస్ ప్రిన్సిపాల్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



కొణిజర్ల : జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్ఐ శంకరరావు, తదితరులు



కారేపల్లి : పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్‌కుమార్

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: ఏజెన్సీలో విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యాన గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని.. ఈవిషయంలో అధికారులు కూడా అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం దరఖాస్తులను అధికారులకు వాటిని అందచేసి అర్హులైన వారికి సత్వరమే ప్రభుత్వ పథకాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ప్రజలు విషజ్వరాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని, వైద్యులు గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఐటీడీఏ పరిపాలన అధికారి భీమ్, అధికారులు సురేష్‌బాబు, మునీర్‌పాషా, ఆర్.శ్రీనివాస్, ఆదినారాయణ, దుర్గయ్య, హరీశ్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న పీఓ

ప్రజల దీవెనల కోసం వస్తున్నా..

- ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య
- రామానగరం నుంచి ఎన్నికల ప్రచారం..

సత్తుపల్లి: 'సాధారణ కుటుంబంలో పుట్టిన నన్ను ప్రజలు గుండెల్లో పెట్టుకొని మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు... నాలుగో సారి మీ దీవెనల కోసం వచ్చాను.. ఆశీర్వదించండి' అని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. సత్తుపల్లి మండలం రామానగరం నుంచి సోమవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ శక్తివంచన లేకుండా పనిచేసి సత్తుపల్లిని అగ్రగామిగా తీర్చిదిద్దానని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకున్నానని, గతంలో ఎవరూ ఇలా ప్రజల ఇళ్లకు వెళ్లలేదని చెప్పారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో పేద బిడ్డల పెళ్లికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అమలుచేయడం లేదని, దివ్యాంగులకు రూ.4వేలు పింఛన్ ఇవ్వకున్నా ఇక్కడ మాత్రం అలవి కాని హామీలు ఇస్తున్న ఆ పార్టీ నేతలను నిలదీయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ 50ఏళ్లల్లో చేయలేని పనులను సీఎం కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లల్లో చేశారని తెలిపారు. కాగా, గత ఎన్నికల్లో దుష్టులు, దుర్మార్గులని దుమ్మెత్తి పోసుకున్న ఇప్పుడు కలిసి వస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గంగారం, రామగోవిందాపురం, పాకలగూడెం, కిష్టాపురం, తుంబూరు, సదాశివునిపాలెం, సిద్ధారం, గౌరిగూడెం, కొత్తూరు గ్రామాల్లోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయగా, పూర్తయిన పనులను ప్రారంభించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు, ఎంపీపీ దొడ్డా హైమావతి, కొత్తూరు ఉమామహేశ్వరరావు, వనమా వాసు, జెడ్పీటీసీ కె.రామారావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డా శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వెంకటవీరయ్యకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

సత్తుపల్లిటౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పట్టణంలోని కల్పతరు రోడ్డు సమీపాన శనివారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో స్థానిక మసీద్‌రోడ్‌కు చెందిన యాసిన్(22)కు తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, ఆయనకు భార్యతో పాటు ఓ కుమార్తె ఉండగా, భార్య ప్రస్తుతం గర్భిణి. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుశకుమార్ తెలిపారు.

చింతకాని మండలంలో..

చింతకాని: మండలంలోని నేరడకు చెందిన సీహెచ్.నాగరాజు(21) పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మద్యానికి బానిసైన ఆయన మత్తులోనే ఈనెల 23న పురుగుల తాగాడు.దీంతో కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై ఆయన తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై రాజేందర్ తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు శిక్ష

ఖమ్మం లీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో ఏడాది జైలుశిక్షతో పాటు రూ.10 లక్షలు చెల్లించాలని ఖమ్మం స్పెషల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి రాళ్లబండి శాంతిలత సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం ప్రశాంతినగర్‌కు చెందిన కొప్పుల రవి వద్ద బోనకల్‌కు చెందిన వి.చంద్రశేఖర్ 2013 అక్టోబర్ 10న రూ.8 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆతర్వాత ఆయన 2015 సెప్టెంబర్ 30న రూ.10 లక్షల చెక్కు జారీ చేయగా అది బ్యాంకులో నిరాదరణకు గురైంది. దీంతో రవి తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. కేసు విచారణ అనంతరం నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.10లక్షలు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

142 జీఓను రద్దు చేయాలని వైద్య ఉద్యోగుల ధర్నా

ఖమ్మంవైద్యవిభాగం: జీఓ 142ను రద్దు చేయాలనే డిమాండ్‌తో కలెక్టరేట్ ఎదుట సోమవారం వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జీఓ రద్దు పోరాట కమిటీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖను నిర్వీర్యం చేసేలా ఉన్న ఈ జీఓను వెంటనే రద్దు చేయాలన్నారు. ఉద్యోగ సంఘాలతో చర్చించి జనాభా ప్రాతిపదికన ఉద్యోగులకు నష్టం లేని విధంగా అమలుచేయాలని కోరారు. వచ్చేనెల 5లోపు స్పందించకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని తెలిపారు. ఈ ధర్నాకు టీఎన్జీవోస్, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ నాయకులు మద్దతు తెలపగా జేఏసీ బాధ్యులు కలెక్టర్, డీఎంహెచ్ఓకు వినతిపత్రాలు అందజేశారు.



ధర్నాలో పాల్గొన్న వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు

మద్యం మత్తులో యువకుల ఘర్షణ

నేలకొండపల్లి: మద్యం మత్తులో యువకులు గొడవకు దిగిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని జాతీయ రహదారి నిర్మాణ ప్రాంతంలో పలువురు యువకులు సోమవారం పట్టపగలే మద్యం మత్తులో ఘర్షణకు పాల్పడ్డారు. రెండు వర్గాల వారు మద్యం తాగాక రాజకీయ అంశాలు ప్రస్తావనకు రావడంతో మాటామాట పెరిగి దాడులకు దారి తీసింది. అంతేకాకుండా ఫోన్‌లో ఓ మహిళతో దురుసుగా మాట్లాడడం వివాదం పెరగడానికి కారణమైంది. ఈ గొడవలో ఓ యువకుడు బంగారం గొలుసు మాయమైందని సమాచారం. ఇప్పటివరకు ఎవరు కూడా పోలీసులకు ఫిర్యాదు చేయకపోగా, ఇరువర్గాల నడుమ రాజీ కుదిర్చేందుకు కొందరు నాయకులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

బాయిలర్ పేలిన డెయిరీలో తనిఖీలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 8వ డివిజన్ గోపాలపురంలోని ఒక ప్రైవేట్ డెయిరీలో ఇటీవల బాయిలర్ పేలగా అధికారులు విచారణ ముమ్మరం చేశారు. ఘటన జరిగిన రోజు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేసి యజమాని అందుబాటులో లేరు. దీంతో సోమవారం తాళం తీయించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ డెయిరీ పరిసరాలను పరిశీలించారు. గతంలో ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ తీసుకున్నా గడువు దాటాక రెన్యువల్ చేసుకోలేదని గుర్తించారు. అనంతరం డెయిరీలో పాలు, పాల ఉత్పత్తుల శాంపిల్స్ సేకరించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ల్యాబ్ నుంచి వచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పెద్దమ్మతల్లి హుండీ ఆదాయం రూ.31.56 లక్షలు



పాల్వంచరూరల్: మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయ హుండీలను సోమవారం లెక్కించారు. 108 రోజులకు గాను రూ.31, 56, 673 ఆదాయం లభించిందని, వీటితో పాటు వివిధ దేశాల కరెన్సీ లభించింది. మిశ్రమ వెండి, బంగారం లభించగా వాటిని సీజ్ చేసి తిరిగి హుండీలో వేసినట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ పి.భేల్‌సింగ్, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం పాల్గొన్నారు.

గోవిందాపురం ఘర్షణలో 50 మందిపై కేసు

గ్రామంలో పోలీసు పికెటింగ్

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్)లో కాంగ్రెస్, సీపీఎం వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలకు చెందిన 50 మందిపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని వైరా ఏసీపీ రెహమాన్ వెల్లడించారు. గ్రామాన్ని సోమవారం రాత్రి సందర్శించిన ఆయన శాంతిభద్రతలను పర్యవేక్షించారు. ఇరువర్గాలకు చెందిన 50 మందిని తహసీల్దార్ పున్నం చందర్ ముందు బైండోవర్ చేశామని తెలిపారు. గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతుండగా, ఎవరైనా గొడవలు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మధిర సీఐ వసంత్‌కుమార్, ఎస్ఐ సాయికుమార్ ఉన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీపీ రెహమాన్